131

# తెలంగాణ ప్రభుత్వం

## నీటిపారుదలశాఖ - శ్వేత పత్రం

## నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధిశాఖ

## విషయ సూచిక


**1. ఉపోద్ఘాతం ............ 3**

**2. నీటిపారుదల సామర్థ్యం ( Irrigation Potential) ............ 7**

2.1 రంగాల వారీగా నీటిపారుదల అయకట్టు వివరాలు (ఐ.పి.) మరియు చేసిన వ్యయం............ 8

2.2 ప్రాజెక్ట్ వారీగా 15.81 లక్షల ఎకరాల ఐ.పి. యొక్క విభజన............ 9

**3. కృష్ణా బేసిస్‌లోని ప్రాజెక్టులు............ 11**

**4. గోదావరి బేసిస్‌లోని ప్రాజెక్టులు............ 16**

**5. కాళేశ్వరం ప్రాజెక్ట్............ 19**

5.1 పరిచయం............ 19

5.2 నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) నివేదిక:............ 20

5.3 విజిలెన్స్ నివేదిక............ 21

**6. బడ్జెట్ కేటాయింపులు.. ఖర్చుల వివరాలు ............ 24**

6.1 బడ్జెట్ కేటాయింపు వివరాలు............ 24

6.2 చేసిన ఖర్చుల వివరాలు ............ 25

6.3 కొనసాగుతున్న ప్రాజెక్ట్‌ల వివరాలు............ 26

**7. నీటిపారుదల వివరాలు- ఆర్థిక విశ్లేషణ ............ 31**

7.1 బడ్జెట్ కేటాయింపులు.. రుణాలు............ 31

7.2 రాష్ట్ర ఏర్పాటు తర్వాత బడ్జెట్ కేటాయింపులో నీటిపారుదల శాఖ వాటా:............ 32

7.3 నీటిపారుదల ప్రాజెక్టులు సంవత్సరాల వారీగా – కేటాయింపులు:............ 32

**8. కార్పొరేషన్ రుణాలతో చేపట్టిన ప్రధాన ప్రాజెక్టులు వాటి వివరాలు ............ 34**

8.1 రుణాల ఆధారిత ప్రాజెక్ట్‌ల వివరాలు ............ 34

8.2 2024 నుండి 2034 వరకు ఆర్థిక ప్రణాళిక............ 35

**9. నీటిపారుదల రంగం- సమగ్ర విశ్లేషణ ............ 37**

# 1. ఉపోద్ఘాతం

తెలంగాణకు ఇరువైపులా రెండు మహత్తరమైన నదులు ప్రవహిస్తున్నాయి. కృష్ణా, గోదావరి రెండు నదుల మధ్య ఉన్న భూభాగం వంద మీటర్ల నుంచి ఆరు వందల మీటర్ల ఎత్తున విస్తరించిన మెట్ట ప్రాంతం మనది. తెలంగాణ రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం 276.96 లక్షల ఎకరాలు, ఇందులో సాగు భూమి 167.17 లక్షల ఎకరాలు (మొత్తం విస్తీర్ణంలో సుమారు 60%).

తెలంగాణ రాష్ట్రం దాదాపు 3.80 కోట్ల జనాభాతో 12వ అతిపెద్ద రాష్ట్రంగా వున్నది. గ్రామీణ జనాభాలో (62%) 2/3 వంతు కంటే ఎక్కువ మంది కార్మికులు నేరుగా వ్యవసాయ రంగంలో నిమగ్నమై ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయం సుమారు 1/5వ వంతు వాటాను అందిస్తుంది.

మెట్ట ప్రాంతం యొక్క ఆర్థిక వ్యవసాయ శ్రేయస్సును నిర్ధారించడానికి నీటిపారుదల విస్తరణ మరియు నీటిని అందించడమే ఒక మార్గం. రాష్ట్ర నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడానికి చారిత్రక కాలం నుండి నిరంతర ప్రయత్నాలు జరిగాయి.

కాకతీయుల కాలంలో నిర్మించిన రామప్ప, ఘనపురం, పాకాల, లక్నవరం వంటి గొలుసుకట్టు చెర్వులు ఆయకట్టుకు నీరందించాయి. ఆ తర్వాత నిజాం ప్రభుత్వం నిర్మించిన నీటిపారుదల ప్రాజెక్టులు రైతులను ఆదుకున్నాయి.

1920 నాటికి నిజాం కాలంలోనే మన ప్రాంతంలో పోచారం ప్రాజెక్ట్ (మెదక్ జిల్లా), డిండి ప్రాజెక్ట్ (నల్గొండ జిల్లా), పాలేరు, వైరా ప్రాజెక్టులు (ఖమ్మం), ఎగువ మానేరు ప్రాజెక్ట్ (కరీంనగర్), సదర్మాట్, స్వర్ణ ప్రాజెక్టులు (ఆదిలాబాద్), ఫతేనహర్ మరియు మహబూబ్ నహర్ ప్రాజెక్టులు నిర్మించారు. నిజామాబాద్ జిల్లాలో నిజాం సాగర్, ఆదిలాబాద్ జిల్లాలో కడెం ప్రాజెక్టు, మహబూబ్‌నగర్ జిల్లాలో సరళసాగర్ ప్రాజెక్టు అప్పటి గొప్ప ఇంజనీర్ నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ మార్గదర్శకత్వంలో నిజాం ప్రభుత్వం నిర్మించింది. హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలకు, వరదలను నియంత్రించేందుకు మూసీపై హిమాయత్‌సాగర్ మరియు ఉస్మాన్ సాగర్ ట్యాంకులు నిర్మించారు.

నిజాం కాలంలో నిర్మించిన సదర్మాట్, ఘన్ పూర్ ఆనికట్ లు వందేళ్లు దాటినా పటిష్టంగా ఉండి.. ఇప్పటికీ ఆయకట్టుకు నీళ్లు ఇస్తున్నాయి. సదర్మాట్ ఆనికట్ కు ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు దక్కింది. నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మించి వందేళ్లకు చేరువవుతోంది.. ఆ ప్రాజెక్టు ఇప్పటికీ పటిష్టంగా ఉంది. హైదరాబాద్ తాగునీటి కోసం నిర్మించిన జంట జలాశయాలు.. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రజల దాహం తీర్చడమే కాదు.. పర్యాటక కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి. నిజాం జమానాలోని అప్పర్ మానేరు ఇప్పటికీ పటిష్టంగా ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులే ఇప్పటికే తెలంగాణకు సాగునీటి వరప్రదాయినిగా ఎక్కువ ఆయకట్టుకు నీళ్లు ఇస్తున్నాయి. శ్రీశైలం తెలంగాణ కరెంట్ అవసరాలు తీర్చడంతో పాటు.. దాదాపు ఎనిమిది లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ఎస్ఎల్బీసీ టన్నెల్, కల్వకుర్తి లిఫ్ట్ స్కీం ప్రాజెక్టులను అప్పటి ప్రభుత్వమే చేపట్టింది.

నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయాన్ని ఎదిరించేందుకు తెలంగాణ ఉద్యమం మొదలైంది. ఏళ్లకేళ్లుగా పోరాడి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న ఘనత పోరాటంలో అమరులైన ఎందరో వీరులది. వారి కుటుంబాలది.. మన సకల జనులది.. సబ్బండ వర్గాలది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో అటు కృష్ణా.. ఇటు గోదావరి సాగునీటి గలగలలతో మన పంట పొలాలన్నీ సస్యశ్యామలం అవుతాయనుకున్న ప్రజల ఆశలు, ఆకాంక్షలు ఇప్పటికీ అనుకున్న లక్ష్యాన్ని అందుకోలేదనే చెప్పుకోవాలి. గత ప్రభుత్వ పదేండ్ల పాలనలో నీళ్ల దోపిడీ ఆగకపోగా.. నాలుగింతలైంది.

అప్పుడు నీళ్లపై పోరాటం చేసిన ఉద్యమ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుల విషయంలో ఒంటెత్తు పోకడలను అనుసరించింది. ఇంజనీర్లు, నిపుణుల సలహాలు సూచనలను పట్టించుకోకుండా సొంత ఇంజనీరింగ్ ఆలోచనలతో నీటి పారుదల ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో తెలంగాణకు అన్యాయం చేసింది.

కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన వాటాలను సాధించటంలో గత ప్రభుత్వం విఫలమైంది. పరివాహక ప్రాంతానికి అనుగుణంగా నీళ్ల వాటాలకు పట్టుబట్టకుండా ఏపీకి 512 టీఎంసీలు ఇచ్చి..తెలంగాణకు 299 టీఎంసీలకే అంగీకరించింది. ఫలితంగా దక్షిణ తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల రైతుల నోటి కాడి ముద్ద ఎత్తకొట్టినట్లయింది. రెండు రాష్ట్రాలకు నిర్దేశించిన 811 టీఎంసీల్లో కృష్ణా బేసిన్ పరివాహక ప్రాంతం ఆధారంగా మనకు 68.5 శాతం వాటా రావాలి. అంతర్జాతీయ నదీ జలాల న్యాయ సూత్రాలన్నీ అదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దీని ప్రకారం

న్యాయబద్ధంగా తెలంగాణకు దక్కాల్సిన 555 టీఎంసీలను తెచ్చుకోవాలనే సోయి గత ప్రభుత్వానికి లేకుండా పోయింది.

అటు కృష్ణా, గోదావరి బోర్డుల ఏర్పాటు గెజిట్ నోటిఫికేషన్‌కు గత ప్రభుత్వం అంగీకరించింది. కృష్ణా పై ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణను కేంద్రానికి అప్పగించేందుకు ఫైళ్లు కదిపింది. 2014 జూన్ 2న రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ అధికారం నుంచి దిగిపోయే చివరి రోజు వరకు.. అంటే 2023 డిసెంబరు 1వ తేదీ వరకు వివిధ సందర్భాల్లో జరిగిన బోర్డు మీటింగ్ మినట్స్, అధికారులు రాసిన లెటర్లన్నీ అందుకు సాక్ష్యాలుగా ఉన్నాయి.

ఇటు గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టును కడుతున్నట్లు రూ.1.47 లక్షల కోట్లతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ మూడేండ్లకే కుంగిపోయింది. నిట్టనిలువునా పియర్లకు ఇప్పటికే పెద్ద పెద్ద పగుళ్లు వచ్చాయి. ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు బుంగలు పడ్డాయి. ఆ రెండు బ్యారేజీలు కూడా ఇలాగే కుంగిపోయే ప్రమాదం ఉందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ హెచ్చరించింది. వీటిలో నీటిని నిల్వ చేస్తే మరింత ప్రమాదమని సూచించింది. అందుకే ఎన్నికలకు ముందే గత ప్రభుత్వం బ్యారేజీల గేట్లు ఎత్తి నీటిని ఖాళీ చేసింది.

అటు కృష్ణా జలాల నిర్వాకం.. ఇటు గోదావరి మీద నిర్మించిన లిఫ్ట్ లు, బ్యారేజీలు, పంప్ హౌజ్ ల విధ్వంసంతో తెలంగాణ సాగునీటి పారుదల వ్యవస్థ చిన్నాభిన్నమైంది. నీటి ప్రాజెక్టుల పేరిట రూ. 1.81 లక్షల కోట్లు ఖర్చుపెట్టడంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు శరాఘాతం తగిలింది. 2014 నుండి 2023 వరకు నీటి పారుదల రంగానికి కేటాయించిన బడ్జెట్, ప్రాజెక్టుల పేరిట ఏర్పాటు చేసిన కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన రుణాలతో కలిపి అప్పులు, వడ్డీల భారం పెరిగిపోయింది. రాష్ట్ర ఖజానా మొత్తం అప్పుల భారంతో కుంగిపోయింది. భావి తరాలు మోయలేని విధంగా ప్రాజెక్టులపై గత ప్రభుత్వం చేసిన అప్పులు తీర్చాలంటే వడ్డీతో సహా రాబోయే పదేండ్లలో రూ. 1.35 లక్షల కోట్లు తిరిగి చెల్లించాల్సిన పరిస్థితి ఉంది.

గడిచిన పదేండ్లలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం అనుసరించిన విధ్వంసక ధోరణి తెలంగాణను నట్టేటా ముంచింది. గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాలు, భారీ అప్పులు, అవినీతితో పాటు అడుగడుగునా జరిగిన అవకతవకలు మన రాష్ట్రానికి పూడ్చలేనంత నష్టం తెచ్చిపెట్టాయి.

ఈ శ్వేత పత్రం నీటి పారుదల రంగం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు మరియు సవాళ్ల గురించి సమగ్రమైన సమాచారాన్ని అందించడం, ఈ లోపాలను అధిగమించడానికి సాధ్యమయ్యే ప్రభుత్వ చర్యలను అన్వేషించడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ శ్వేత పత్రం వివిధ ప్రాజెక్టుల అమలు, పురోగతిని, వాటి నీటిపారుదల సామర్థ్యాన్ని తెలియజేస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పాటు కృష్ణా గోదావరి జలాలతో వీలైనంత ఎక్కువ ఆయకట్టుకు సాగు నీటిని అందించే లక్ష్యంతో, రైతుల ఆదాయం పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకునే చర్యలను ప్రస్తావిస్తుంది.

## 2. నీటిపారుదల సామర్థ్యం ( Irrigation Potential)

నీటిపారుదల సామర్థ్యం (ఐ.పి.) అనగా ప్రాజెక్ట్ నుండి నీటిపారుదల చేయగల ఆయకట్టు విస్తీర్ణాన్ని సూచిస్తుంది. తెలంగాణలో 2004 సంవత్సరం వరకు ఉన్న ఆయకట్టు 52.08 లక్షల ఎకరాలు. 2004-2014 సంవత్సరం వరకు 5.71 లక్షల ఎకరాలు.

రాష్ట్ర విభజనకు ముందు సాగులో ఉన్న ఆయకట్టు అంటే, 2014 వరకు 57.79 లక్షల ఎకరాలు, మొత్తం ఖర్చు రూ.54,234 కోట్లు. అంటే ఒక్కో ఎకరానికి కేవలం రూ. 93 వేలు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత (2014-2023), పదేండ్లలో రూ.1,81,067 కోట్ల వ్యయంతో 15.81 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయకట్టు సాగులోకి వచ్చింది. అంటే ఒక్కో ఎకరానికి రూ.11.45 లక్షలు ఖర్చు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కింద మొత్తం రూ. 1.29 లక్షల కోట్లను గత ప్రభుత్వం ఖర్చు పెట్టింది. ఈ మూడు ప్రాజెక్టుల కింద ఇప్పటికే ఎకరానికి సగటున రూ. 1.31 కోట్లు ఖర్చు పెట్టింది.

ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులు పూర్తయితే, రాష్ట్రం మొత్తం నీటిపారుదల సామర్థ్యం 127.58 లక్షల ఎకరాలకు చేరుతుందని అంచనా ప్రతిపాదనలున్నాయి. మిగిలి ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి 53.98 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకి నీరివ్వడానికి రూ.97,774 కోట్లు అవసరం.

అయిదేండ్లలో చెల్లించాల్సిన అప్పులు వడ్డీలు కలిపి రాబోయే అయిదేండ్లలో చెల్లించాల్సిన రుణభారం రూ.77369 కోట్లు. మిగిలినవి కూడా పూర్తి చేయాలంటే మొత్తం ప్రాజెక్టులకు చేయవలసిన వ్య**యం** రూ.1,75,143 కోట్లు. తద్వార ఒక్క ఎకరానికి నీరు ఇవ్వడానికి రూ.3.4 లక్షల ఖర్చు అవుతుంది. రేట్లల్లో వచ్చే మార్పుల వల్ల పెరిగే ఖర్చు దీనికి అదనం.

**టేబుల్ 1: వివిధ ప్రాజెక్ట్లలో ఆయకట్టు వివరాలు:**

| రంగం | మొత్తం అంచనా | ఆయకట్టు సృష్టించబడింది | బ్యాలెన్స్ ఆయకట్టు |
|---|---|---|---|
| భారీ (25,000 ఎకరాల కంటే ఎక్కువ ఐ.పి.) | 91.79 | 39.66 | 52.13 |
| మధ్యతరహా (ఐ.పి. 5,000-25,000 ఎకరాల మధ్య) | 4.86 | 4.07 | 0.79 |
| చిన్నతరహా (ఐ.పి. 5,000 ఎకరాల వరకు) | 25.71 | 25.12 | 0.59 |
| చిన్న ఎత్తిపోతలు (ఐ.డి.సి. పథకాలు) | 5.22 | 4.76 | 0.46 |
| **సంపూర్ణ మొత్తము** | **127.58** | **73.6** | **53.98** |

## 2.1 రంగాల వారీగా నీటిపారుదల ఆయకట్టు వివరాలు (ఐ.పి.) మరియు చేసిన వ్యయం

**టేబుల్ 2: రాష్ట్ర ఏర్పాటుకు ముందు మరియు ఏర్పడిన తర్వాత ఐ.పి. సృష్టి**

| క్ర.సం. | వివరణ | 2014కి ముందు | | 2014 తర్వాత | |
|---|---|---|---|---|---|
| | | చేసిన ఖర్చు (రూ. కోటి) | సాగునీరు అందించబడ్డ ఆయకట్టు ఐ.పి. (లక్ష ఎకరాలు) | చేసిన ఖర్చు (రూ. కోటి) | సాగునీరు అందించబడ్డ ఆయకట్టు (ఐ.పి.) (లక్ష ఎకరాలు) |
| 1 | భారీ | 45827.19 | 57.79 | 168622.61 | 13.04 |
| 2 | మధ్యతరహా | 2441.35 | | 1270.74 | 0.59 |
| 3 | చిన్నతరహా | 4582.92 | | 10873.29 | 0.6 |
| 4 | ఐ.డి.సి | 1382.4 | | 301.2 | 1.58 |
| | **మొత్తం** | **54,234** | **57.79** | **1,81,068** | **15.81** |

## 2.2 ప్రాజెక్ట్ వారీగా 15.81 లక్షల ఎకరాల ఐ.పి. యొక్క విభజన

**టేబుల్ 3: రాష్ట్రం ఏర్పడిన తర్వాత (జలయజ్ఞం+కొత్త ప్రాజెక్టులు) సాగునీరు అందిన ఆయకట్టు**

| క్ర.సం. | ప్రాజెక్ట్ | రంగం | ప్రతిపాదిత ఆయకట్టు (లక్ష ఎకరాలలో) | సాగునీరు అందించబడిన అయకట్టు (లక్ష ఎకరాలలో) |
|---|---|---|---|---|
| 1 | కాళేశ్వరం ప్రాజెక్ట్* | భారీ | 19.63 | 0.99 |
| 2 | జె. చొక్కా రావు దేవాదుల ఎత్తిపోతల పథకం | భారీ | 5.58 | 2.70 |
| 3 | మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం | భారీ | 4.51 | 2.94 |
| 4 | ఎలిమినేటి మాధవ రెడ్డి ప్రాజెక్ట్ ఎస్.ఎల్.బి.సి | భారీ | 4.11 | 0.46 |
| 5 | శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ స్టేజ్-2 | భారీ | 3.97 | 1.38 |
| 6 | శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ స్టేజ్ నుండి ఫ్లడ్ ఫ్లో కాలువ | భారీ | 2.52 | 0.50 |
| 7 | రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం సహా సంగం బండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ | భారీ | 2.03 | 1.46 |
| 8 | జవహర్ నెట్టంపాడు ఎత్తిపోతల పథకం | భారీ | 2.00 | 1.39 |
| 9 | శ్రీపాద సాగర్ (ఎల్లంపల్లి) ఎత్తిపోతల పథకం | భారీ | 1.78 | 0.54 |
| 10 | మత్తడివాగు ప్రాజెక్టు | మధ్య | 0.85 | 0.02 |
| 11 | శ్రీ కొమరం భీమ్ ప్రాజెక్ట్ | మధ్య | 0.45 | 0.14 |
| 12 | సింగూర్ కాలువ | భారీ | 0.40 | 0.40 |
| 13 | కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం | భారీ | 0.38 | 0.26 |

| | | | | |
|---|---|---|---|---|
| 14 | గడ్డెన సుద్దవాగు ప్రాజెక్టు | మధ్య | 0.14 | 0.12 |
| 15 | నీల్వాయి ప్రాజెక్ట్ | మధ్య | 0.13 | 0.08 |
| 16 | కిన్నెరసాని ప్రాజెక్ట్ | మధ్య | 0.1 | 0.07 |
| 17 | పాలెంవాగు ప్రాజెక్టు | మధ్య | 0.1 | 0.07 |
| 18 | గొల్లవాగు ప్రాజెక్ట్ | మధ్య | 0.095 | 0.07 |
| 19 | చౌటుపల్లి హనుమంతరెడ్డి ఎల్ఐఎస్ | మధ్య | 0.08 | 0.007 |
| 20 | రాలివాగు ప్రాజెక్ట్ | మధ్య | 0.024 | 0.01 |
| | **ఉప మొత్తం** | **48.16** | | **13.63** |
| 1 | చిన్న తరహా ప్రాజెక్టులు | | | 0.6 |
| 2 | ఐ.డి.సి. పథకాలు | | | 1.58 |
| | | **మొత్తం** | **15.81** | |

*కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక్కటే 2014 తర్వాత ప్రారంభమైంది. (ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టును రీ-ఇంజనీరింగ్ చేసిన ప్రాజెక్ట్).

## 3. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు

కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టుల్లో ముఖ్యమైనవి నాగార్జునసాగర్, శ్రీశైలం, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, ఆర్‌డీఎస్, పాలమూరు రంగారెడ్డి. కృష్ణా నదిపై ఉన్న జూరాల, నాగార్జునసాగర్ డ్యామ్ ల నుంచి నీరు గ్రావిటీ మీద తెలంగాణకు చేరుతోంది. తుంగ భద్రపై కట్టిన రాజోలిబండ, మూసీపైన ఉన్న మూసీ ప్రాజెక్టు, డిండీ పైన కట్టిన డిండీ ప్రాజెక్టు నుంచి ప్రవాహ మార్గంగానే పొలాలకు చేరుతోంది. మిగతా ప్రాజెక్టులు లిఫ్ట్‌లపై ఆధారపడ్డాయి.

కృష్ణా ప్రాజెక్టుల విషయంలోనూ కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు ముందునుంచీ అన్యాయమే జరిగింది. గడిచిన పదేండ్లలోనూ ఈ ప్రాజెక్టులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. దీంతో దక్షిణ తెలంగాణలోని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు తీరని అన్యాయం జరిగింది.

కృష్ణా నీళ్లలో తెలంగాణకు అన్యాయం జరిగిందనే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మొదలైంది. శ్రీశైలం నీళ్లను పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా పెన్నా బేసిన్‌లోని రాయలసీమకు తరలించుకుపోతున్నారనే అప్పుడున్న పది జిల్లాలు ఒక్కటై కొట్లాడాయి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కెపాసిటీని 11 వేల క్యూసెక్కుల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచినప్పుడు ప్రశ్నించిన పార్టీ నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణా ప్రాజెక్టులను గాలికొదిలేశారు.

2020లో పోతిరెడ్డిపాడును 80 వేల క్యూసెక్కులకు పెంచటంతో పాటు పక్కనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్మాణం చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం జీవో జారీ చేస్తే ప్రేక్షక పాత్ర పోషించారు. కుండకు గండి కొట్టినట్లుగా శ్రీశైలం రిజర్వాయర్ అట్టడుగున ఉన్న నీటిని కూడా తీసుకెళ్లేందుకు ఏపీ చేసిన ప్రయత్నాలను అడ్డుకోలేదు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్పటి ప్రభుత్వం కేంద్రానికి ఫిర్యాదు చేయలేదు.

అదే సమయంలో జరిగిన రెండో అపెక్స్ మీటింగ్‌కు బిజీ షెడ్యూలు కారణంగా రాలేకపోతున్నానంటూ, మీటింగ్ వాయిదా వేయాలని అప్పటి ముఖ్యమంత్రి లేఖ రాయటం గత ప్రభుత్వ వైఖరిని బయటపెట్టింది. మహబూబ్‌నగర్‌కు చెందిన రైతు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి స్టే తెచ్చేంత వరకు అప్పటి ప్రభుత్వం నిద్ర నటించింది. గత ప్రభుత్వ నిర్వాకంతో కృష్ణా జలాలను ఏపీ యథేచ్ఛగా తమ ప్రాంతానికి మళ్లించుకుంటోంది. పోతిరెడ్డిపాడు, సంగమేశ్వరం, ముచ్చుమర్రి నుంచి రోజుకు 9.5 టీఎంసీల నీటిని ఏపీ ఖాళీ చేస్తోంది.

జలాశయం నిండకముందే నీళ్లు తరలించుకుపోయేలా ఈ ప్రాజెక్టులు కట్టుకుంది. శ్రీశైలం నీళ్లను మళ్లించి రాయలసీమను రతనాల సీమగా మార్చడానికి ఆనాటి సీఎం ఏపీకి సహకరించటం తెలంగాణ భవిష్యత్తుకు తీరని నష్టం తెచ్చిపెట్టింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మొట్టమొదటగా పునాది రాయి వేసిన పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ క్రింద రూ.27,812 కోట్లు ఖర్చు పెట్టినా ఒక్క ఎకరం కొత్త ఆయకట్టును కూడా సాగులోకి రాలేదు. రెండు టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసేందుకు చేపట్టిన ఈ ప్రాజెక్టును అకారణంగా ఒక్క టీఎంసీకి కుదించారు. ఎన్నికల ముందు ఎల్లూరు పంపుహౌస్ నుంచి ఒక్క మోటారు మాత్రమే నడిపించి కొన్ని నీళ్లు పోయించారు.

మరుసటి రోజున ప్రారంభించిన డిండి లిఫ్ట్ ప్రాజెక్టు కూడా పెండింగ్ జాబితాలోనే పడిపోయింది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు.

తెలంగాణ ఉద్యమంలో ఆర్డీఎస్ నీళ్ల సాధన కోసం పాదయాత్ర చేసిన పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆర్డీఎస్ ఆధునీకరణను మరిచిపోయింది. దీనిని సప్లిమెంట్ చేయడానికి తుమ్మిళ్ల పేరుతో లిఫ్ట్ పెట్టి ఒక్క మోటారుతో నీళ్లు పోయించి ఆర్భాటం చేశారే తప్ప ఆ పనులు పూర్తి చేయలేదు. దీంతో ఆర్డీఎస్ ఆయకట్టు ఒక్క ఎకరం కూడా పెరుగలేదు.

గత ప్రభుత్వం అనుసరించిన దుర్నీతి కారణంగా ఇప్పుడు.. శ్రీశైలంపై ఆధారపడ్డ మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల భవితవ్యం ప్రమాదంలో పడినట్లయింది. ప్రధానంగా నాగార్జునసాగర్ లో నీటి నిల్వలు తగ్గిపోతాయి. దీనిపై ఆధారపడ్డ నల్గొండ ఖమ్మం జిల్లాల ఆయకట్టు రైతులు నష్టపోతారు.

## కృష్ణా జలాల నీటి వాటాల్లో అన్యాయం

కృష్ణా జలాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల పంపిణీకి గత ప్రభుత్వం 2015లో అంగీకరించింది. అప్పుడు అడ్ హాక్ కేటాయింపులకు అంగీకరించటంతో రాష్ట్రానికి న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాలు సాధించుకోలేదు. ఏడాదికోసారి నీటి పంపిణీపై ముగ్గురు సభ్యులతో రెండు రాష్ట్రాలకు చెందిన కమిటీ మీటింగ్‌లు జరిగినప్పుడల్లా తాత్కాలిక వాటాలకే ఒప్పందం చేసుకుంది.

కృష్ణా బేసిన్‌లో మన తెలంగాణ 68.50 శాతం పరివాహక ప్రాంతం ఉంది. దీని ప్రకారం కృష్ణాలో మనకు 555 టీఎంసీల నీళ్లు, ఏపీలో కృష్ణా పరివాహక ప్రాంతం 31.50 శాతం మాత్రమే. దామాషా ప్రకారం ఏపీకి 256 టీఎంసీలు రావాలి. సహజ జల వనరుల పంపిణీ సూత్రాలు వేటిని పరిగణనలోకి తీసుకున్నా తెలంగాణకు 555 టీఎంసీల వాటా దక్కాలి. అందుకు భిన్నంగా గత ప్రభుత్వం ఏపీకి ఎక్కువ నీటి వాటాలను కట్టబెట్టింది.

ఇటీవల ప్రాజెక్టుల పరిధికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి 50; 50 శాతం నీటి వాటాలు కేటాయించాలనే షరతు విధించింది. ఏ ప్రాతిపదికన చూసినా మనకు 68 శాతం రావాల్సిన నీటి వాటాలను 50 శాతం కోరడం అర్థరహితం. తెలంగాణ ప్రయోజనాలకు భంగం వాటిల్లినట్లే.

### అంతర్రాష్ట్ర అంశాలు

- భౌగోళికంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టుల నీటి వినియోగాల ఆధారంగా 2015లో కృష్ణా జలాల్లో 299 (తెలంగాణ) : 512 (ఆంధ్రప్రదేశ్) అంటే, 37: 63 తాత్కాలిక పంపకాల నిష్పత్తికి గత తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. చిన్న నీటి వనరుల కేటాయింపులు, పోలవరం కుడి ప్రధాన కాలువ ద్వారా కృష్ణా నదికి గోదావరి మళ్లింపు మరియు నీటి ఆవిరి నష్టాలను మినహాయించి KRMB 34 (తెలంగాణ) : 66 (ఆంధ్రప్రదేశ్) కొనసాగించింది.
- జూన్ 2015లో, జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన అంతర్రాష్ట్ర సమావేశంలో, 2015-16 నీటి సంవత్సరానికి 512:299 (ఆంధ్రప్రదేశ్: తెలంగాణ) నిష్పత్తిలో పంచడానికి తాత్కాలికంగా తెలంగాణ అంగీకరించింది.
- అప్పటి గౌరవనీయులైన తెలంగాణ ముఖ్యమంత్రి మొదటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో (21 సెప్టెంబర్ 2016) 2015-16 వర్కింగ్ అరేంజ్‌మెంట్‌ను మరో ఏడాది పాటు కొనసాగించడానికి అంగీకరించారు.
- తర్వాత, స్వల్ప మార్పులతో అదే ఏర్పాటు 2022-23 వరకు కొనసాగుతోంది.
- ప్రస్తుతం, 06-10-2023 న త్రిసభ్య కమిటీ నిర్ణయం ప్రకారం, నీటి పంపకం జరుగుతోంది. అదే నీటి విడుదల ఉత్తర్వుల ఆధారంగా నిర్ణీత వినియోగాల్లోనే నీటిని విడుదల చేస్తున్నారు.

### కృష్ణా ప్రాజెక్టుల అధికార పరిధికి సంబంధించిన వరుస క్రమం

- తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు సంబంధించి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో గత ప్రభుత్వం విఫలమైంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం కృష్ణా బేసిన్‌పై ఉన్న ప్రాజెక్టుల నీటి నిర్వహణ, నియంత్రణ కోసం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పడింది.

- 2015లోనే గత ప్రభుత్వం కృష్ణా బేసిన్‌పై ప్రాజెక్టులను అప్పగించడానికి సంబంధించిన ముసాయిదాకు ఆమోదం తెలిపింది. ఈఎన్‌సి లేఖ (Lr No. ENC (I)/DCEIV/OT5/AEE18/KRMB/VolII/2014 Dt.18-05-2015).

- 2020 అక్టోబర్ 06న కేంద్ర జల శక్తి మంత్రి అధ్యక్షతన జరిగిన రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అదే మీటింగ్‌లో KRMB, GRMB అధికార పరిధిని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేస్తుందని నిర్ణయం జరిగింది.

- 2021 జులై 15న కేంద్ర ప్రభుత్వం KRMB అధికార పరిధిపై గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుండి అరవై రోజుల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.200 కోట్ల చొప్పున ఒకేసారి సీడ్ మనీని కేఆర్ఎంబీ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని, ఇదే నోటిఫికేషన్ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ప్రస్తుతమున్న ప్రాజెక్ట్‌లు, కొనసాగుతున్న ప్రాజెక్టులు పూర్తి కాగానే వాటి అధికార పరిధిని కేఆర్ఎంబీకి అప్పగించాలనే కీలక నిబంధనలు అందులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌ను గత ప్రభుత్వం సవాలు చేయలేదు. ఫలితంగా ఈ నోటిఫికేషన్ అమల్లోకి వచ్చింది. దీనికి అనుగుణంగానే కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులను అప్పగించేందుకు అప్పటి ప్రభుత్వం మొగ్గు చూపింది.

- 2021 అక్టోబర్ 21వ తేదీన జరిగిన 15వ KRMB సమావేశంలో ప్రాధాన్యత క్రమంలో శ్రీశైలం మరియు నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన 15 కాంపోనెంట్లను అప్పగించి నోటిఫికేషన్‌ను అమలు చేసేందుకు సబ్ కమిటీ చేసిన సిఫారసులను బోర్డు ఆమోదించింది. అందులో తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ కుమార్, ఈఎన్‌సీ మురళీధర్  పాల్గొన్నారు.

- 2022 మే 6వ తేదీన జరిగిన 16వ  KRMB సమావేశంలో ప్రాజెక్టుల నీటి నిర్వహణ నియామవళి (రూల్ కర్వ్) ఖరారు చేసిన వెంటనే, ప్రాజెక్టు భాగాలను అప్పగించేందుకు అవసరమైన ఉత్తర్వులను తెలంగాణ ప్రభుత్వం జారీ చేస్తుందని సీఎస్ బోర్డుకు హామీ ఇచ్చారు. తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ కుమార్, ఈఎన్‌సీ మురళీధర్ ఇందులో పాల్గొన్నారు.

- గత ఏడాది ఫిబ్రవరి 11న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్ లో నీటి పారుదల & కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్  గ్రాంట్ల డిమాండ్ లో  (డిమాండ్ నంబర్. 33) రాష్ట్ర ప్రభుత్వం కేఆర్ఎంబీకి రూ.200 కోట్ల వన్‌టైమ్ సీడ్ మనీ ఇచ్చేందుకు నిధుల కేటాయింపులు చేసింది.

- రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున (నవంబర్ 30న) నాగార్జునసాగర్ ప్రాజెక్టుపైకి ఏపీ ప్రభుత్వం సాయుధ పోలీసులను పంపించి అక్రమంగా నీటి విడుదల చేసుకుంది.  ఈ చొరబాటు ఘటనపై గత  ప్రభుత్వం చేష్టలుడిగినట్లు వ్యవహరించింది.

మరుసటి రోజున 01.12.2023 రోజున అప్పటి నీటి పారుదల శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ కేఆర్ఎంబీ ఛైర్మన్ కు ఈ సంఘటనపై లేఖ రాశారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ లాంటి ఉమ్మడి ప్రాజెక్టుల నియంత్రణను బోర్డుకు అప్పగించడానికి తెలంగాణ సూత్రప్రాయంగా అంగీకరించిన విషయాన్ని ఆ లేఖలో స్పష్టం చేశారు.  '15.7.2021 తేదీ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఉమ్మడి ప్రాజెక్టులు అంటే శ్రీశైలం మరియు నాగార్జునసాగర్ నియంత్రణను అప్పగించేందుకు రెండు రాష్ట్రాలు సూత్రప్రాయంగా అంగీకరించిన విషయం కూడా మీకు తెలుసు. కానీ రెండు డ్యామ్‌ల ఆపరేషన్ ప్రోటోకాల్‌ను ఖరారు చేయనందున అప్పగింత ప్రక్రియ ఆలస్యమైంది…" అని లేఖలో ప్రస్తావించారు.

# 4. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులు

గోదావరి బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టులలో పెద్దది శ్రీరాంసాగర్ ప్రాజెక్టు. ఇప్పటికీ ఈ ప్రాజెక్టు ద్వారానే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సారెస్పీ దిగువన రామగుండం సమీపంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు మరో అత్యంత కీలకమైన ప్రాజెక్టు. ఎస్సారెస్పీలో అంతర్భాగంగా నిర్మించిన లోయర్ మానేరు డ్యాం, మిడ్ మానేరు, ఎల్లంపల్లి ప్రాజెక్టులు ఉమ్మడి రాష్ట్రంలోనే పూర్తయ్యాయి. ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా ఇచ్చిన గోదావరి నీళ్లనే గత ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లుగా ప్రచారం చేసుకుంది.

దేవాదుల ప్రాజెక్టు రెండు దశలు పూర్తి కావటంతో పాటు కొంత ఆయకట్టుకు గత ప్రభుత్వాల హయంలోనే నీళ్లందాయి. గత పదేండ్లలో దేవాదుల ఫేజ్–3 పనులు పూర్తయితే జనగాం ప్రాంతానికి సాగునీరు అందేది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను సీతారామ ఎత్తిపోతల పేరుతో రీ డిజైనింగ్ చేసి రూ.7 వేల కోట్లు ఖర్చు చేశారు.. దీనికిందా ఒక్క ఎకరానికి నీళ్లు ఇవ్వలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గౌరవెల్లి ప్రాజెక్టును అక్కడే కుర్చీ వేసుకొని పూర్తి చేయిస్తానన్న గత పాలకులు పూర్తి చేయలేకపోయారు.

మహారాష్ట్ర నుంచి ఎస్సారెస్పీ (పోచంపాడు) ప్రాజెక్టుకు నీళ్లు రాకుంటే కాళేశ్వరం నుంచి నీళ్లు రివర్స్ ఎత్తిపోసేందుకు తలపెట్టిన ఎస్సారెస్పీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఫలితం ఇవ్వలేకపోయింది. ఎల్లంపల్లి నుంచి తెచ్చిన నీళ్లను ఎస్సారెస్పీ కాల్వ ద్వారా వివిధ దశల్లో లిఫ్ట్ చేసేందుకు చేపట్టిన ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రెండింతలు దాటింది.

### డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు రీడిజైన్‌తో జరిగిన అనర్థాలు

గోదావరి నుంచి ఏటా సముద్రం వైపు పరుగులు తీస్తున్న నీటిని మెట్ట ప్రాంతాలకు మళ్లించాలనే లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో జలయజ్ఞంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత - చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును ప్రభుత్వం తలపెట్టింది. ప్రాణహిత నదిపై ఆదిలాబాదు జిల్లా తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మిస్తారు. వార్ధా, పైన్ గంగ నదులు కలిసి ప్రాణహిత నదిగా మారే స్థానం ఇది. ఇక్కడి నుండి 160 టీఎంసీల నీటిని ఎత్తిపోయాలనేది అప్పటి ప్రతిపాదన.

ఈ ప్రాజెక్టు డిజైన్ ప్రకారం తుమ్మడిహెట్టి నుంచి నీటిని వివిధ దశల్లో పంపింగు చేస్తూ 600 మీటర్ల ఎత్తున్న చేవేళ్ళ వరకూ వివిధ దశల్లో నీటిని లిఫ్ట్ చేస్తారు. ఎనిమిది ఉమ్మడి జిల్లాల్లో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు, దారిలో ఉన్న గ్రామాలకు, హైదరాబాద్ సిటీ తాగునీటి అవసరాలకు, పారిశ్రామిక అవసరాలకు నీటిని కేటాయిస్తారు.

ఈ ప్రాజెక్టును రూ.38,500 కోట్లతో మొదలు పెట్టగా.. గత ప్రభుత్వం రీ డిజైన్ పేరుతో దీన్ని కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చి నిర్మాణ వ్యయాన్ని గత ప్రభుత్వం రూ.1.47 లక్షల కోట్లకు పెంచింది.

తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్ర ప్రభుత్వంతో అగ్రిమెంట్ చేసుకుంది. అక్కడ పనులు చేయకుండా వంద కి.మీ.ల దిగువన మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును మొదలు పెట్టింది. ప్రాజెక్టు సైట్‌ను వంద కి.మీ.ల కిందికి మార్చినప్పటికీ ప్రాణహితలో వచ్చే వరదపైనే ఆధారపడింది.

తుమ్మిడిహెట్టి నుంచి ఒక స్టేజీలో ఎల్లంపల్లికి నీటిని పంపు చేసే ఆస్కారం ఉన్నా దానిని పక్కన పెట్టి మూడు స్టేజీల్లో నీళ్లు ఎత్తిపోయటం నిర్వహణ పరంగా, ఆర్థికంగా భారంగా మారింది. కేవలం 21 మీటర్లు మాత్రమే నీటిని ఎత్తిపోస్తే ఎల్లంపల్లికి నీళ్లు చేరేదానికి మూడు స్టేజీల్లో 50 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్ చేసే ఉల్టా పుల్టా అలోచనలు చేసింది.

ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును అర్థాంతరంగా ఆపేయటంతో నష్టం జరిగింది. తుమ్మిడిహెట్టి నుంచి నాలుగు ప్యాకేజీల్లో మైలారం వరకు 71 కి.మీ. గ్రావిటీ కాల్వ తవ్వి లైనింగ్ చేసి వృథాగా వదిలేశారు. ఎల్లంపల్లికి ఎగువన నాలుగు, ఐదు ప్యాకేజీల్లో 56,500 ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందకుండా పోయాయి.

తుమ్మిడిహెట్టి కడితే ఇప్పటికే తవ్విన 2 టీఎంసీల గ్రావిటీ కాలువను ఉపయోగించుకుని ఆసిఫాబాద్, సిర్పూర్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాల్లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు అందుతాయని ఆశపడ్డ రైతులు మోసపోయారు. ఇటు రంగారెడ్డి జిల్లాలో 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందకుండా పోయింది. చేవెళ్ల, తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల్లోని ఆయకట్టును పాలమూరు - రంగారెడ్డిలో ప్రాజెక్టులో చేర్చారు. కానీ ఆ ప్రాజెక్టునే ఒక టీఎంసీకి కుదించడంతో మొత్తంగా చేవెళ్ల ప్రాంత ఆయకట్టు ప్రమాదంలో పడింది.

ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తడకపల్లి చెరువు (ప్రస్తుత మల్లన్నసాగర్) లోకి నీటిని ఎత్తిపోసేందుకు మొదలు పెట్టిన పంపుహౌస్ కూడా వృథా అయింది. తడకపల్లి నుంచి పాములపర్తి (ప్రస్తుత కొండపోచమ్మసాగర్), చేవెళ్ల ప్యాకేజీలకు నీటిని తరలించేందుకు తవ్విన గ్రావిటీ కాల్వలు వృథా అయ్యాయి. ఆ కాల్వలు మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో మునిగిపోయాయి.

రీ డిజైనింగ్ ఫలితంగా కరెంట్ బిల్లు పది రెట్లు పెరిగింది. 160 టీఎంసీలు ఎత్తిపోసే ప్రాణహిత కరెంట్ బిల్లు రూ.1,010 కోట్లు మాత్రమే అవుతుందని అప్పట్లో  అంచనా వేశారు.  ఇప్పుడు కాళేశ్వరం నుంచి నీటిని లిఫ్ట్ చేసేందుకు ఏడాదికి రూ.10 వేల కోట్ల కరెంట్ బిల్లు అవుతోంది.

# 5. కాళేశ్వరం ప్రాజెక్ట్

## 5.1 పరిచయం

కాళేశ్వరం సమీపంలోని మేడిగడ్డ వద్ద గోదావరి నదిపై బ్యారేజీ (ఆనకట్ట) నిర్మించి, అక్కణ్నుంచి అన్నారం.. అక్కణ్నుంచి సుందిళ్ల.. మూడు చోట్ల 190 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని లిఫ్ట్ చేసి తెలంగాణలోని 7 ఉమ్మడి జిల్లాలకు సాగునీటిని అందించేందుకు ఈ భారీ ప్రాజెక్టు చేపట్టారు.

ఈ ప్రాజెక్టును 7 లింకులు, 28 ప్యాకేజీలుగా విభజించారు. 1500 కిలోమీటర్ల కాలువలు మరియు 200 కిలోమీటర్ల సొరంగాలు. మొత్తం 141 టిఎంసిల నిల్వ సామర్థ్యం తో 15 జలాశయాలు, 3 బ్యారేజీలు ఉన్నాయి. 21 పంప్ హౌస్‌లు, 19 సబ్ స్టేషన్లు నిర్మించారు.

కాలువలు, సొరంగాలు, లిఫ్టులు, పంప్ హౌజ్‌లు, జలాశయాలు, డిస్ట్రిబ్యూటరీల ద్వారా మొత్తం 19,63,000 ఎకరాలకు సాగు నీటిని అందించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా, ఎస్ఆర్ఎస్పీ స్టేజ్-I, ఎస్ ఆర్ ఎస్ పి స్టేజ్-II, ఫ్లడ్ ఫ్లో కెనాల్, సింగూర్ & నిజామ్ సాగర్ ప్రాజెక్టుల కింద ఉన్న 18,82,970 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడానికి ప్రతిపాదించారు.

రికార్డు వేగంతో కట్టినట్లు అద్భుతమని చెప్పుకున్న ఈ ప్రాజెక్టు తెలంగాణ పాలిట గుదిబండగా మారింది. ప్లానింగ్‌తో పాటు డిజైన్ల లోపంతో ఈ ప్రాజెక్టు అయిదు ఏండ్లలోనే మూలనపడింది. ఇదేమీ పట్టించుకోకుండా అదనపు టీఎంసీ లిఫ్ట్ చేసేందుకు సిద్ధపడటం అప్పటి ప్రభుత్వపు అనాలోచిత నిర్ణయాలకు అద్దం పట్టింది.

గడిచిన అయిదేండ్లలో కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల నుంచి 162.36 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి 30 టీఎంసీల నీటిని గేట్లు ఎత్తి కిందికి వదిలేశారు. దీంతో ఎత్తిపోతలకు ఖర్చు పెట్టిన నిధులన్నీ గోదావరి పాలయ్యాయి. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోస్తుండటంతో ఎగువ నుంచి భారీ వరద వస్తే ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ గేట్లు ఎత్తి.. అప్పటివరకు లిఫ్ట్ చేసిన నీటిని వృథాగా సముద్రంలోకి వదిలేయాల్సి వస్తుంది.

ఈ ప్రాజెక్టుకయ్యే కరెంటు బిల్లుల ఖర్చు తెలంగాణ ప్రజలపై మోయలేనంత భారం వేసింది. ఈ ప్రాజెక్టులోని పంపులన్నీ వాడితే రాష్ట్రమంతా ఒక రోజు వాడే కరెంట్ కంటే ఎక్కువ విద్యుత్ అవసరమవుతుందని కాగ్ (ఫర్‌ఫార్మన్స్ ఆడిట్ ఆన్ కాళేశ్వరం ప్రాజెక్టు–2024) తన రిపోర్టులో వెల్లడించింది. అంచనాగా ఏడాదికి రూ.10 వేల కోట్లు కరెంట్ బిల్లులకే అవుతుందని లెక్కించింది.

కాళేశ్వరం కట్టినప్పటి నుంచీ ఈ ప్రాజెక్టు పోలీసు పహారా ఉండే నిషేధిత ప్రాంతంగానే ఉండిపోయింది. 2022 జులై 14న గోదావరి వరదల్లో అన్నారం, కన్నెపల్లి పంప్ హౌజ్‌లు నీట మునిగాయి. మోటార్లకు రక్షణగా నిర్మించిన ప్రొటెక్షన్ వాల్ కూలిపోయింది. అప్పుడే భారీ నష్టం జరిగింది.

కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ 2023 అక్టోబర్ 21న కుంగిపోయింది. దీంతో ఈ ప్రాజెక్టులోని మిగతా బ్యారేజీల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

మేడిగడ్డలోని ఏడో బ్లాక్‌లోని పియర్స్ నిట్ట నిలువునా బీటలు వారాయి. బారేజ్ యొక్క ఏడో బ్లాక్‌లో 20 వ పియర్ (స్తంభం) కుంగింది. పీయర్ నంబర్ 20 కుంగడం వల్ల, పీయర్ నంబర్ 21 నుండి 16 వరకు ఉన్న రహదారి వంతెన ప్యానెల్లు మరియు పారాపెట్ గోడ కుంగిపోయింది. రోడ్డు వంతెన మరియు పారాపెట్ గోడ ఉపరితలంపై పగుళ్లు ఉన్నాయి.

### 5.2 నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) నివేదిక:

మేడిగడ్డ డ్యామ్ పియర్స్ కుంగిపోవడానికి NDSA వెల్లడించిన కారణాలు: (D.O. No TE -16/3/2023 NDSA-MoWR, Dt: 01.11.2023)

i. ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ, కంట్రోల్, నిర్వహణ నియంత్రణ లోపాలు

ii. వైఫల్యానికి ప్రధాన కారణం బారేజ్ రాఫ్ట్ కుంగిపోవడం. దాంతో పియర్స్ కూడా కుంగడంతోపాటు, కదిలిపోయింది. పగుళ్ళు వచ్చాయి. పైపింగ్, పియర్స్ కింద ఉన్న ఇసుక కదలటం, , ఫౌండేషన్ మెటీరియల్ కు (ఇసుక) తగినంత బేరింగ్ సామర్థ్యం లేకపోవడం, బారేజ్ లోడ్ కారణంగా ఎగువన ఉన్న పైల్స్ ఫెయిలయ్యే కారణాలు ప్రస్తావించింది.

iii. సికేంట్ పైల్స్ నిర్మాణంలో కఠినమైన నాణ్యత నియంత్రణ లేకపోవడం, రాఫ్ట్ మరియు కట్- ఆఫ్ ల మధ్య ప్లింత్ కనెక్షన్లో నిర్మాణ లోపం ఉన్నట్లు కనిపిస్తోంది. సికేంట్ పైల్ నిర్మాణంలో ఖాళీలు ఏర్పడి ఉండవచ్చు. ఇది నీటి ప్రవాహానికి అడ్డంగా ఉండటం వలన పైపింగ్, వైఫల్యానికి దారితీసింది.

iv. ప్రాజెక్టు ప్లానింగ్, డిజైన్‌లో లోపాలు ఉన్నాయి. మొదట ఈ ఆనకట్టను తేలియాడే నిర్మాణంగా రూపకల్పన చేశారు, ధృడమైన నిర్మాణంగా నిర్మించారు. బారేజ్ ఎగువన మరియు దిగువన, సికాంట్ పైల్ కట్-అఫ్ లు రాక్ వరకు నిర్మించబడ్డాయి. ఫలితంగా, సికాంట్ పైల్ యొక్క నిర్మాణ స్వభావం మారింది. ఉపరితల ప్రవాహాన్ని నిరోధించడం వల్ల నీటి ఒత్తిడి పెరిగింది. క్రాస్ కట్-ఆఫ్స్ కోసం అనుసరించిన నిర్మాణ పద్ధతి డిజైన్‌కు కంటే భిన్నమైన పరిస్థితులకు దారితీసింది. బారేజ్ ఎగువన నిర్మించిన గోడ అమరిక వలన, బారేజ్ హైడ్రాలిక్ చర్య లోపించింది.

v. ప్రతి సంవత్సరం రుతుపవనాల తర్వాత వెంటనే ఆనకట్ట యజమాని అప్రాన్ ప్రాంతంలో పరిశీలించి, నిర్మాణాల పరిసరాల్లో, అప్రాన్ల లోపాలు అంచనా వేయాలి. లాంచ్ చేయని భాగాన్ని కూడా జాగ్రత్తగా పరిశీలించాలి, ముఖ్యంగా దిగువన (D/s), ఇన్వర్టెడ్ ఫిల్టర్ కూడ పరిలిశీంచాలి. ప్రతి సంవత్సరం వర్షాకాలం ముందు సమయంలో ఎగువన(U/s) నీటి లోపల ఉపయోగించే లాంప్ల ద్వారా తనిఖీ చేయాలి. జాయింట్ల మీద కూడా జాగ్రత్తగా తనిఖీ నిర్వహించబడాలి. 2019-20లో ఆనకట్ట నిర్మాణం ప్రారంభమైనప్పటి నుండి ఆనకట్ట యజమానులు సిమెంట్ కాంక్రీటు బ్లాక్లను లేదా అప్రాన్లను తనిఖీ నిర్వహించలేదు. ఈ విషయంలో, నిర్వహణ లోపం కారణంగా క్రమంగా ఆనకట్టను బలహీనపడింది, తద్వార వైఫల్యానికి దారితీసింది. ఇది ఆపరేషన్ మరియు నిర్వహణ యొక్క ఒక ముఖ్యమైన లోపం.

vi. NDSA తెలంగాణ రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ వర్షాకాలం ముందు, తరువాత అసాధారణ సంకేతాల కోసం క్రమం తప్పకుండా తనిఖీలు చేయమని కోరింది. కానీ తెలంగాణ రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ నిర్లక్ష్యం చేసింది. డ్యామ్ సేఫ్టీ యాక్ట్ 2021 యొక్క చాప్టర్ X యొక్క సెక్షన్ 41 (బి) లోని నిబంధనలు వర్తిస్తాయి. NDSA 2021 నిబంధనలను అనుసరించలేదు. ఇది తీవ్రమైన విషయం, ఎందుకంటే బారేజ్ వైఫల్యం అనేది, సమాజానికి మరియు ఆర్థిక వ్యవస్థకు అధిక ప్రమాదం.

vii. మేడిగడ్డ బారేజ్ లోని ఒక బ్లాక్ లో ఏర్పడిన లోపం, బారేజ్ మొత్తం పనితీరును ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. ప్రస్తుత పరిస్థితిలో ఉన్న బారేజ్ పూర్తిగా పునరుద్ధరించే వరకు పనికిరాదు.

viii. దెబ్బతిన్న బ్లాక్ లను నిర్మాణాత్మకంగా పునరుద్ధరించాల్సి ఉంటుంది. ఇతర బ్లాకులకు కూడా ఇదే జరుగవచ్చు. ఇది మొత్తం బారేజ్ పునరుద్ధరణకు దారితీస్తుంది.

ix. ప్రస్తుత స్థితిలో రిజర్వాయర్ నింపడం వల్ల బారేజ్ కి మరింత నష్టం వాటిల్లుతుంది. బారేజ్ పునరుద్ధరణ సాధ్యంకాదు.

x. కాళేశ్వరం ప్రాజెక్టు లో మేడిగడ్డకు ఎగువన ఉన్న రెండు బారేజీలు, అంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా ఇదే విధమైన నమూనాలతో నిర్మించారు. ఇవి కూడా ముప్పునకు గురయ్యే అవకాశముంది. అన్నారం బారేజ్ దిగువన ఇటువంటి సంకేతాలు ఇప్పటికే ఉన్నాయి, ఇది వైఫల్యానికి సంకేతం. ఈ బారేజీలను పైపింగ్/ డిస్ట్రెస్ సంకేతాల కోసం కూడా అత్యవసరంగా పరిశీలించాలి.

## 5.3 విజిలెన్స్ నివేదిక

కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ ఆరోపణలపై విచారణ జరిపేందుకు ప్రభుత్వ ఆదేశాలతో విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ బృందాన్ని పంపించింది. విజిలెన్స్ బృందం వెల్లడించిన వివరాలు..

- ఈ ప్రాజెక్టు ప్రారంభమైన తొలి ఏడాదిలోనే 2020లోనే మేడిగడ్డ బ్యారేజీ పగుళ్లను గుర్తించారు. వెయిరింగ్ కోట్‌లో ఉన్న సీసీ బ్లాకులు కొట్టుకుపోయినట్లు గుర్తించారు. వీటిని సరిచేయాలని 18.05.2020న ఇరిగేషన్ విభాగం ఎల్ అండ్ టీ కి నోటీసులు జారీ చేసింది.
- 17.02.2021న మరోసారి సీసీ బ్లాకల విషయంలో నోటీసులు జారీ చేసింది.
- 06.04.2022న మరోసారి సీసీ బ్లాకులు కొట్టుకుపోతున్నాయని నోటీసు ఇచ్చింది.
- 28.04.2023న మేడిగడ్డకు ఎగువన, దిగువన రెండు వైపులా సీసీ బ్లాకులు కొట్టుకుపోతున్నాయని మరోసారి ఎల్ అండ్ టీకి నోటీసు ఇచ్చింది. 7వ బ్లాక్ లోని 17, 18, 19, 20 వెంట్ల నుంచి నీళ్లు ఫౌంటేన్‌లా బయటకు వస్తున్నాయని, నీళ్లలో వదిలేసిన కాపర్ డ్యామ్ మెటీరియల్‌ను తొలిగించాలని నోటీసులిచ్చారు.

- డిపార్ట్‌మెంట్ నిర్దేశిత క్రమ పద్ధతి ప్రకారం పనిని నిర్వహించలేదు. బ్లాక్-7కి సంబంధించిన ఎం బుక్స్ మరియు ఇతర రికార్డుల ద్వారా ఈ విషయం బయట పడింది. రాఫ్ట్ మరియు సెకెంట్ పైల్స్ నిర్దిష్ట క్రమ పద్ధతిలో వేయలేదని గుర్తించారు.
- ఉన్నత అధికారుల తనిఖీ నివేదికలు లేనప్పటికి అనేక డీవియేషన్లకు ఆమోదం తెలిపారు.
- అప్పటి ముఖ్యమంత్రి 2019 జూన్ 19న బ్యారేజీని ప్రారంభించారు. అప్పటి నుండి బ్యారేజీ నిర్వహణ కార్యకలాపాలను చేపట్టలేదు.
- ఇండియన్ స్టాండర్డ్ కోడ్ IS 7349:2012 ప్రకారం ఆపరేషన్స్, మెయింటెనెన్స్ క్లాజ్ 5.3.1 & 5.3.2 ప్రకారం డ్యామ్ యజమాని ప్రతి వర్షాకాలం తర్వాత ఆప్రాన్ ప్రాంతాన్ని సౌండింగ్, ప్రోబింగ్ చేపట్టాలి. ఇది చేపట్టలేదు.
- బ్యారేజీ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన షీట్ పైల్స్, కాఫర్ డ్యామ్‌ను బ్యారేజీ పూర్తి చేసిన తరువాత తొలిగించలేదు.
- 3D మోడల్ అధ్యయనం యొక్క సిఫార్సుల ప్రకారం U/s & D/s ఇసుక మేటలను పేర్కొన్న స్థాయిలకు తగ్గించలేదు.
- అగ్రిమెంట్ (షరతు నెం.50) ప్రకారం, కాంట్రాక్టర్ (L&T) పనులు పూర్తి చేయలేదు. కంప్లీషన్ సర్టిఫికెట్లు మరియు రిపేర్ ప్రాసెస్‌లను పోల్చడానికి V&E ఇతర ప్రధాన బ్యారేజీలలో సమానమైన రికార్డులను తీసుకుని పరిశీలన చేస్తుంది.
- ఇంజనీర్-ఇన్-చీఫ్ (రామగుండం) 11.11.2020న 29.02.2020 నుండి డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ ఎఫెక్ట్‌లను ప్రకటించారు. కానీ పని పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఏజెన్సీకి బ్యాంక్ గ్యారెంటీలను

విడుదల చేయాలని సిఫార్సు చేస్తూ ఇంజనీర్-ఇన్-చీఫ్(రామగుండం) ది.11.11.2020 తేదీ నాడు లేఖ రాశారు. ఇది తప్పు కాబట్టి అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి.

- ప్రాజెక్ట్ డిజైన్‌లు, డ్రాయింగ్‌లు, జియోలాజికల్ పరిశోధనలు, అన్ని కాంక్రీటు నిర్మాణాల నాణ్యతను సమగ్రతను పరిశీలించడం చాలా అవసరం. బ్యారేజీ వైఫల్యానికి గల కారణాలను గుర్తించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని V&E సూచించారు.

## 6. బడ్జెట్ కేటాయింపులు.. ఖర్చుల వివరాలు

### 6.1 బడ్జెట్ కేటాయింపు వివరాలు

తెలంగాణ ప్రాంతంలో సాగునీటి రంగానికి ఇప్పటివరకు మొత్తం కేటాయించిన బడ్జెట్ రూ. 1,87,842.83 కోట్లు, ఇందులో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు (01.06.2014 నాటికి) రూ. 54,051 కోట్లు కేటాయించగా, రాష్ట్రం ఏర్పడిన తర్వాత (01.06.2014 తర్వాత) రూ. 1,33,791.52 కోట్లు కేటాయించారు.

**టేబుల్ 4: సంవత్సరం వారీగా బడ్జెట్ అంచనాలు** (కోట్ల లో)

| క్ర.సం. నం. | సంవత్సరం వారీగా బడ్జెట్ | మేజర్ ఇరిగేషన్ | మీడియం ఇరిగేషన్ | మైనర్ ఇరిగేషన్ | ఇతర | గ్రాండ్ మొత్తం |
|---|---|---|---|---|---|---|
| A | **1.6.2014 నాటికి** | **43982.95** | **2855.31** | **4582.92** | **2630.13** | **54051.31** |
| 1 | బి.ఇ 2014-15 | 3775.96 | 94.67 | 2215.09 | 414.28 | 6500.00 |
| 2 | బి.ఇ 2015-16 | 5200.67 | 211.10 | 2162.28 | 925.95 | 8500.00 |
| 3 | బి.ఇ 2016-17 | 14572.64 | 801.45 | 2417.27 | 7208.64 | 25000.00 |
| 4 | బి.ఇ 2017-18 | 19195.38 | 856.80 | 2296.66 | 2651.16 | 25000.00 |
| 5 | బి.ఇ 2018-19 | 17511.40 | 615.97 | 2743.69 | 4128.94 | 25000.00 |
| 6 | బి.ఇ 2019-20 | 7383.62 | 423.73 | 1160.70 | 476.90 | 9444.95 |
| 7 | బి.ఇ 2020-21 | 7336.35 | 180.90 | 1012.35 | 35.41 | 8565.01 |
| 8 | బి.ఇ 2021-22 | 4877.15 | 253.65 | 1194.78 | 623.37 | 6948.95 |
| 9 | బి.ఇ 2022-23 | 7916.39 | 206.33 | 1208.18 | 256.18 | 9587.08 |
| 10 | బి.ఇ 2023-24 | 7601.61 | 254.79 | 1307.99 | 81.14 | 9245.53 |
| B | **రాష్ట్ర ఏర్పాటు తర్వాత (1 to 10)** | **95371.17** | **3899.39** | **17718.99** | **16801.97** | **133791.52** |
| **మొత్తం బడ్జెట్ (A+B)** | | **139354.12** | **6754.70** | **22301.91** | **19432.10** | **187842.83** |

### 6.2 చేసిన ఖర్చుల వివరాలు

మొత్తం వెచ్చించిన వ్యయం రూ. 2,35,302 కోట్లు, ఇందులో రూ. 54,234 కోట్లు రాష్ట్ర ఏర్పాటు వరకు (01.06.2014 నాటికి) ఖర్చు కాగా మరియు రాష్ట్రం ఏర్పడిన తర్వాత (01.06.2014 తర్వాత) రూ.1,81,068 కోట్లు ఖర్చు అయినది. ప్రాజెక్టుల వారీగా ఖర్చుల వివరాలు ఇలా ఉన్నాయి

**టేబుల్ 5: సంవత్సరం వారీగా చేసిన ఖర్చుల వివరాలు** (రూ కోట్ల లో)

| సంవత్సరం | మేజర్ ఇరిగేషన్ | | | మీడియం ఇరిగేషన్ | మైనర్ ఇరిగేషన్ | ఇతర | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| | రాష్ట్ర నిధులు | రుణం | మొత్తం | | | | |
| **2014 నాటికి** | **45827.19** | **0** | **45827.19** | **2441.35** | **4582.92** | **1382.4** | **54233.87** |
| 2014-15 | 4506.1 | 0 | 4506.1 | 100.05 | 568.16 | 19.93 | 5194.24 |
| 2015-16 | 6347.55 | 0 | 6347.55 | 70.86 | 1291.51 | 66.09 | 7776.01 |
| 2016-17 | 11275.31 | 484.46 | 11759.77 | 222.41 | 2029.18 | 137.64 | 14149.00 |
| 2017-18 | 10988.28 | 10802.19 | 21790.47 | 206.96 | 1359.59 | 41.07 | 23398.09 |
| 2018-19 | 7822.19 | 21937.92 | 29760.1 | 196.06 | 1081.49 | 17.91 | 31055.57 |
| 2019-20 | 8374.66 | 14531.37 | 22906.03 | 116.46 | 995.55 | 1.01 | 24019.05 |
| 2020-21 | 6976.34 | 10754.25 | 17730.59 | 114.24 | 1291.26 | 8.24 | 19144.33 |
| 2021-22 | 12024.98 | 16696.94 | 28721.92 | 123.71 | 1382.73 | 5.53 | 30233.89 |
| 2022-23 | 7743.63 | 8883.29 | 16626.92 | 41.69 | 674.62 | 2.11 | 17345.34 |
| 2023-24 | 8473.14 | 0 | 8473.14 | 78.3 | 199.2 | 1.67 | 8752.31 |
| **2014-24** | **84,532** | **84,090** | **1,68,623** | **1,271** | **10,873** | **301** | **1,81,067** |

రాష్ట్ర ఏర్పాటుకు ముందు చేసిన వ్యయం (రూ 54,234 కోట్లు) రాష్ట్ర నిధులు/ఖజానా నుండి మాత్రమే ఖర్చు చేయబడిందని పై పట్టికలో స్పష్టంగా తెలుస్తుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఖర్చు చేసిన 1,81,067 కోట్లలో 84,090 కోట్లు (రూ 1,81,067 కోట్లలో ~46%) రుణ భాగం.

## 6.3 కొనసాగుతున్న ప్రాజెక్ట్ల వివరాలు

**టేబుల్ 6: ప్రోగ్రెస్ వివరాలు మరియు నీటిపారుదల సంభావ్యత సృష్టిని చూపించే ప్రాజెక్ట్ల వివరణాత్మక జాబితా**

| క్ర.సం. నం. | ప్రాజెక్ట్ పేరు | రంగం | | ఖర్చు (కోట్లలో) | | నీటిపారుదల సంభావ్య సృష్టి (లక్ష ఎకరాల్లో) | | | % భౌతిక పురోగతి | ఆర్థిక పురోగతి |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | రాష్ట్ర ఏర్పాటుకు ముందు/తర్వాత | పరిపాలనా అనుమతి ఖరీదు | బ్యాలెన్స్ నిధులు అవసరం | మొత్తం ప్రతిపాదిత ఆయకట్టు | సాధించిన అయకట్టు | సాధించాల్సిన ఆయకట్టు | | |
| I | **రుణ ఆధారిత ప్రాజెక్ట్లు** | | | | | | | | | |
| a | **తెలంగాణ స్టేట్ వాటర్ రిసోర్సెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టి ఎస్ డబ్ల్యు ఆర్ ఐ డి సి ఎల్) ద్వారా చేపట్టబడింది** | | | | | | | | | |
| | ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్ - మొత్తం | మేజర్ | ముందు | 11819.97 | 1718.13 | 2.53 | 0.5 | 2.06 | 80% | 85% |
| | జె చొక్కా రావు దేవాదుల ఎత్తిపోతల పథకం మొత్తం | మేజర్ | ముందు | 17500 | 3345.88 | 5.57 | 3.17 | 2.4 | 87% | 81% |
| | సీతా రామ ఎత్తిపోతల పథకం మొత్తం | మేజర్ | తర్వాత | 18286.18 | 10791.9 | 3.28 | 0 | 3.28 | 50% | 41% |

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | సీతమ్మ సాగర్ బహుళ ప్రయోజన ప్రాజెక్ట్ మొత్తం | మేజర్ | తర్వాత | 3481.9 | 2341.6 | 0 | 0 | 0 | 55% | 33% |
| | తుపాకులగూడెం మొత్తం | మేజర్ | ముందు | 2121 | 130 | 0 | 0 | 0 | | 94% |
| b | కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ (క ఐ పి సి ఎల్) ద్వారా చేపట్టబడింది | | | | | | | | | |
| | కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం | మేజర్ | తర్వాత | 127872 | 33999.9 | 19.63 | 0.98 | 18.65 | 76% | 73% |
| | పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మొత్తం | మేజర్ | తర్వాత | 55086 | 27244.3 | 12.3 | 0 | 12.3 | 55% | 51% |
| II | రాష్ట్ర నిధుల కింద ఇతర ప్రాజెక్టులు | | | | | | | | | |
| 1 | మహాత్మా గాంధీ - కల్వకుర్తి ఎత్తిపోతల పథకం | మేజర్ | ముందు | 5860.91 | 377.09 | 4.51 | 3.07 | 1.44 | 70% | 94% |
| 2 | జవహర్ - నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం | మేజర్ | ముందు | 2754 | 250.15 | 2 | 1.42 | 0.58 | 90% | 91% |
| 3 | ఎలిమినేటి మాధవ రెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్ట్ | మేజర్ | ముందు | 12149.01 | 4915.25 | 3.89 | 2.68 | 1.21 | 60% | 60% |
| 4 | రాజీవ్ - భీమ ఎత్తిపోతల పథకం | మేజర్ | ముందు | 2709.28 | 193.8 | 2.03 | 1.58 | 0.45 | 96% | 93% |

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 5 | శ్రీపాదసాగర్ - ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం | మేజర్ | ముందు | 8241.31 | 2874.78 | 1.64 | 0.54 | 1.1 | 82% | 65% |
| 6 | శ్రీ కొమరం భీమ్ ప్రాజెక్ట్ | మీడియం | ముందు | 882.36 | 88.53 | 0.45 | 0.23 | 0.22 | | 90% |
| 7 | కోయిలసాగర్ | మీడియం | ముందు | 809.51 | 150 | 0.38 | 0.26 | 0.12 | 81% | 81% |
| 8 | ప్రాణహిత ప్రాజెక్ట్ ఇ పి సి ప్యాకేజీ-1-5 | మేజర్ | ముందు | 6337 | 0 | 2 | 0 | 2 | | 29% |
| 9 | శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ దశ-II | మేజర్ | ముందు | 1288.57 | 67 | 3.98 | 3.81 | 0.17 | 97% | 95% |
| 10 | నిజాంసాగర్ ఆధునికీకరణ | మేజర్ | ముందు | 954.77 | 126.77 | 2.31 | 2.12 | 0.19 | | 87% |
| 11 | నీల్వాయి | మీడియం | ముందు | 216.47 | 18.47 | 0.13 | 0.08 | 0.05 | | 91% |
| 12 | లెండి | మీడియం | ముందు | 783.72 | 559.79 | 0.22 | 0 | 0.22 | | 29% |
| 13 | పాలెంవాగు | మీడియం | ముందు | 221.47 | 17.01 | 0.1 | 0.07 | 0.03 | | 92% |
| 14 | జగన్నాథపూర్ సమీపంలోని పెద్దవాగు | మీడియం | ముందు | 244.66 | 127 | 0.15 | 0 | 0.15 | | 78% |

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 15 | దిగువ పెంగనగ & చనక్క కొరటా | మేజర్ | తర్వాత | 2164.4 | 1071.74 | 0.51 | 0 | 0.51 | | 50% |
| 16 | సదర్మాట్ | మీడియం | ముందు | 676.59 | 182.55 | 0.11 | | 0.11 | | 73% |
| 17 | డిండి ఎత్తిపోతల పథకం | మేజర్ | తర్వాత | 6190 | 3202.77 | 3.61 | 0 | 3.61 | | 48% |
| 18 | గట్టు ఎత్తిపోతల పథకం | మేజర్ | తర్వాత | 581.06 | 461.8 | 0.28 | 0 | 0.28 | 40% | 21% |
| 19 | చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం | మేజర్ | ముందు | 632 | 232.77 | 0.45 | 0 | 0.45 | | 63% |
| 20 | తుమిల్లా ఎత్తిపోతల పథకం | మేజర్ | తర్వాత | 783 | 624.06 | 0 | 0 | 0 | | 20% |
| 21 | మోడికుంటవాగు | మీడియం | ముందు | 527.66 | 462.92 | 0.14 | 0 | 0.14 | | 12% |
| 22 | మంజీర ఎత్తిపోతల పథకం | మీడియం | తర్వాత | 501.68 | 456.79 | 0.4 | 0 | 0.4 | | 9% |
| 23 | జకోర చండూర్ చింతకుంట ఎత్తిపోతల పథకం | మీడియం | తర్వాత | 106 | 83.11 | 0.08 | 0 | 0.08 | | 22% |

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 24 | చెన్నూర్ ఎత్తిపోతల పథకం | మేజర్ | తర్వాత | 1658 | 1658 | 0.9 | 0 | 0.9 | | 0% |
| | **మొత్తం (టి ఎస్ డబ్ల్యు ఆర్ ఐ డి సి ఎల్ + కె ఐ పి సి ఎల్ + రాష్ట్ర నిధులు)** | | | **293440.48** | **97773.9** | **73.58** | **20.51** | **53.09** | | **65%** |

# 7. నీటిపారుదల వివరాలు- ఆర్థిక విశ్లేషణ

## 7.1 బడ్జెట్ కేటాయింపులు.. రుణాలు

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు 2014 వరకు రాష్ట్ర బడ్జెట్ నుండి పూర్తిగా నిధులు కేటాయించారు. అయితే, 2014 నుండి 2023 వరకు నీటిపారుదల ప్రాజెక్టులకు రాష్ట్ర నిధుల శాతం నిరంతరం 100% నుండి 47%కి తగ్గుతూ వచ్చింది. రుణాల నుండి నిధుల శాతం వాటా 2014లో 0% నుండి 2023లో 39%కి పెరిగింది.

**టేబుల్ 7: మేజర్ ప్రాజెక్టుల నిధుల వివరాలు**

| సంవత్సరం | రాష్ట్రం | ఋణం | మొత్తం | % రాష్ట్ర వాటా | % లోన్ షేర్ |
|---|---|---|---|---|---|
| 2014 వరకు | 45827 | 0 | 45827 | **100** | **0** |
| 2014-15 | 4506 | 0 | 4506 | 100 | 0 |
| 2015-16 | 6348 | 0 | 6348 | 100 | 0 |
| 2016-17 | 11275 | 484 | 11760 | 96 | 4 |
| 2017-18 | 10988 | 10802 | 21790 | 50 | 50 |
| 2018-19 | 7822 | 21938 | 29760 | 26 | 74 |
| 2019-20 | 8375 | 14531 | 22906 | 37 | 63 |
| 2020-21 | 6976 | 10754 | 17731 | 39 | 61 |
| 2021-22 | 12025 | 16697 | 28722 | 42 | 58 |
| 2022-23 | 7744 | 8883 | 16627 | 47 | 53 |
| 2023-24 | 8473 | 0 | 8473 | - | - |
| **2014-24** | **84,532** | **84,090** | **1,68,623** | **50** | **50** |
| **మొత్తం 2024 వరకు** | **1,30,359** | **84,090** | **2,14,450** | **61** | **39** |

## 7.2 రాష్ట్ర ఏర్పాటు తర్వాత బడ్జెట్ కేటాయింపులో నీటిపారుదల శాఖ వాటా:

2014 నుండి 2025 సంవత్సరాలలో తెలంగాణ జి.డి.ఎస్.పి నుండి నీటిపారుదల ప్రాజెక్టులకు % వాటా కేటాయింపులో దిగువన ఉన్న ధోరణి ఉంది, ఇది దిగువ పట్టికలో స్పష్టంగా ఉంది:

**టేబుల్ 8: నీటిపారుదల బడ్జెట్ వర్సెస్ జి.డి.ఎస్.పి వాటా**

| క్ర.సం. నం. | సంవత్సరం | నీటిపారుదల బడ్జెట్ (కోట్లలో) | జి.డి.ఎస్.పి (కోట్లలో) | % జి.డి.ఎస్.పి యొక్క వాటా |
|---|---|---|---|---|
| 1 | 2014-15 | 6500 | 504569 | 1.29 |
| 2 | 2015-16 | 8500 | 576580 | 1.47 |
| 3 | 2016-17 | 25000 | 659847 | 3.79 |
| 4 | 2017-18 | 25000 | 749047 | 3.34 |
| 5 | 2018-19 | 25000 | 856770 | 2.92 |
| 6 | 2019-20 | 9444.95 | 951131 | 0.99 |
| 7 | 2020-21 | 8565.01 | 941872 | 0.91 |
| 8 | 2021-22 | 6948.95 | 1128505 | 0.62 |
| 9 | 2022-23 | 9587.08 | 1313660 | 0.73 |
| 10 | 2023-24 | 9245.53 | 1401701 | 0.66 |

జి.డి.ఎస్.పి తో పోల్చినపుడు నిధుల కేటాయింపులో తగ్గుదల ధోరణిని రుణ సౌకార్యాలను ప్రభావితం చేస్తుంది.

## 7.3 నీటిపారుదల ప్రాజెక్టులు సంవత్సరాల వారీగా – కేటాయింపులు:

గత 10 సంవత్సరాలలో, మేజర్ ప్రాజెక్టలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది, వాటి ప్రయోజనం మరియు మూలధన వ్యయం కూడా ఎక్కువ, ప్రధాన & మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టులలో పెరుగుతున్న వాటా మరియు మధ్యతరహా మరియు చిన్న నీటి వనరుల ప్రాజెక్టులలో తగ్గుదల ట్రెండ్ క్రింది పట్టిక చూపుతుంది.

**టేబుల్ 9: నీటిపారుదల ప్రాజెక్టుల సంవత్సరం వారీగా % కేటాయింపు**

| క్ర.సం. క్ర.సం. నం. | సంవత్సరం వారీగా బడ్జెట్ | మొత్తం బడ్జెట్‌లో ప్రాజెక్ట్ వాటా (%) | | | |
|---|---|---|---|---|---|
| | | మేజర్ ఇరిగేషన్ | మీడియం ఇరిగేషన్ | మైనర్ ఇరిగేషన్ | ఇతర |
| 01.06.14 వరకు బడ్జెట్ | | 81.4 | 5.3 | 8.5 | 4.9 |
| 1 | బి.ఇ 2014-15 | 58.1 | 1.5 | 34.1 | 6.4 |
| 2 | బి.ఇ 2015-16 | 61.2 | 2.5 | 25.4 | 10.9 |
| 3 | బి.ఇ 2016-17 | 58.3 | 3.2 | 9.7 | 28.8 |
| 4 | బి.ఇ 2017-18 | 76.8 | 3.4 | 9.2 | 10.6 |
| 5 | బి.ఇ 2018-19 | 70.0 | 2.5 | 11.0 | 16.5 |
| 6 | బి.ఇ 2019-20 | 78.2 | 4.5 | 12.3 | 5.0 |
| 7 | బి.ఇ 2020-21 | 85.7 | 2.1 | 11.8 | 0.4 |
| 8 | బి.ఇ 2021-22 | 70.2 | 3.7 | 17.2 | 9.0 |
| 9 | బి.ఇ 2022-23 | 82.6 | 2.2 | 12.6 | 2.7 |
| 10 | బి.ఇ 2023-24 | 82.2 | 2.8 | 14.1 | 0.9 |
| B | **Total (1-10)** | **71.3** | **2.9** | **13.2** | **12.6** |
| **మొత్తం బడ్జెట్ (A+B)** | | **73.0** | **3.3** | **12.4** | **11.3** |
| **సి ఎ జి ఆర్ (%)** | | **3.53** | **6.58** | **-8.41** | **-17.98** |

ప్రాజెక్ట్‌ల వాటా పెరుగుదలలో మేజర్ మరియు మీడియం ప్రాజెక్ట్‌ల పెరుగుతున్న ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది, అయితే మైనర్ ప్రాజెక్ట్‌ల యొక్క వాటా క్షీణిస్తూనే ఉన్నాయి. రాష్ట్రంలో భారీ నీటిపారుదల ప్రాజెక్టులను నిర్వహించడానికి ప్రభుత్వం కొత్త కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసింది మరియు కార్పొరేషన్‌కు రుణాలను స్వయంగా బదిలీ చేసింది. దీని వలన నిర్వహించడానికి రాష్ట్రానికి తగినంత ఆర్థిక వనరు ఉన్నప్పటికీ, ప్రాజెక్టుల నిర్వహణ వ్యయం పెరిగింది.

# 8. కార్పొరేషన్ రుణాలతో చేపట్టిన ప్రధాన ప్రాజెక్టులు వాటి వివరాలు

కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ (KIPCL) ద్వారా కాళేశ్వరం, పాలమూరు రెండు ప్రాజెక్టులకు, తెలంగాణ స్టేట్ వాటర్ రిసోర్సెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (TWSRIDCL) ద్వారా ఇందిరమ్మ వరద కాలువ, దేవాదుల ఎత్తిపోతల, సమ్మక్కసాగర్, సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్ ఐదు ప్రాజెక్టుల కోసం రుణాలు తీసుకున్నారు. **KIPCL** ద్వారా రూ.68,**806** కోట్లు, **TWSRIDCL** ద్వారా రూ.15,**284** కోట్లు రుణాలు తీసుకున్నారు. మొత్తంగా రూ.84090 కోట్లు నీటి పారుదల ప్రాజెక్టుల కోసం అప్పులు తెచ్చారు.

## 8.1 రుణాల ఆధారిత ప్రాజెక్ట్ల వివరాలు

**టేబుల్ 10: రుణ ఆధారిత ప్రాజెక్టుల వివరాలు**

| క్రమ. సంఖ్య. | ప్రాజెక్ట్ పేరు | ప్రాజెక్ట్ ఖర్చు | 07-12-2023 వరకు జరిగిన ఖర్చు | | |
|---|---|---|---|---|---|
| | | | రుణం | రాష్ట్ర బడ్జెట్ | మొత్తం |
| I | | | | | |
| ఎ | కాళేశ్వరం ప్రాజెక్ట్ | 1,27,872 | 61,665 | 32,207 | 93,872 |
| బి | పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం | 55,086 | 7,141 | 20,413 | 27,554 |
| | **ఉప మొత్తం (1)** | **1,82,958** | **68,806** | **52,620** | **1,21,426** |
| **II** | | | | | |
| ఎ | ఇందిరమ్మ వరద ప్రవాహ కాలువ | 11,820 | 3,669 | 6,179 | 9,848 |
| బి | దేవాదుల ఎత్తిపోతల పథకం | 17,500 | 3,591 | 10,221 | 13,812 |
| సి | సమ్మకసాగర్ | 2121 | 1621 | 369 | 1990 |
| డి | సీతా రామ ఎత్తిపోతల పథకం | 13,058 | 5,387 | 2,669 | 8,056 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇ | సీతమ్మసాగర్ | 3,482 | 1,016 | 132 | 1148 |
| | ఉప మొత్తం **(2)** | **47,981** | **15,284** | **19,570** | **34,854** |
| | మొత్తం రుణ ఆధారిత ప్రాజెక్ట్‌లు **(1+2)** | **2,30,939** | **84,090** | **72,190** | **1,56,280** |

## 8.2 2024 నుండి 2034 వరకు ఆర్థిక ప్రణాళిక

సాగునీటి ప్రాజెక్టుల పేరిట ప్రభుత్వం చేసిన అప్పులు తడిసి మోపెడయ్యాయి. ఈ అప్పులు వడ్డీలు కలిపి రాబోయే పది సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం 1,35,654 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. వీటిలో 79,343 కోట్లు అసలు, 56,310 కోట్లు వడ్డీలు.

రాబోయే 5 సంవత్సరాలలో, నీటిపారుదల శాఖ వార్షిక రుణ భారం రూ. 16,000 కోట్లు (అనగా, స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తిలో 1%). ఇది శాఖ వార్షిక బడ్జెట్ కేటాయింపుల కంటే ఎక్కువగా ఉండే అవకాశం వుంది.

**టేబుల్ 11: ఆర్థిక నిబద్ధత** (రూ. కోట్లు)

| క్రమ సంఖ్య. | సంవత్సరం | KIPCL | | TSWRIDCL | | KIPCL + TSWRIDCL | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | అసలు | వడ్డీ | అసలు | వడ్డీ | అసలు | వడ్డీ | మొత్తం |
| 1 | 2024-25 | 6017 | 7955 | 1230 | 1430 | 7247 | 9385 | **16633** |
| 2 | 2025-26 | 6545 | 7004 | 1296 | 1300 | 7841 | 8304 | **16144** |
| 3 | 2026-27 | 6545 | 6517 | 1323 | 1162 | 7868 | 7679 | **15547** |
| 4 | 2027-28 | 6545 | 5976 | 1335 | 1022 | 7880 | 6998 | **14878** |
| 5 | 2028-29 | 6545 | 5378 | 1364 | 880 | 7909 | 6258 | **14167** |
| 6 | 2029-30 | 6545 | 4714 | 1389 | 735 | 7934 | 5449 | **13384** |
| 7 | 2030-31 | 6964 | 3964 | 1248 | 588 | 8212 | 4552 | **12764** |
| 8 | 2031-32 | 6964 | 3154 | 1148 | 456 | 8112 | 3610 | **11722** |
| 9 | 2032-33 | 6964 | 2246 | 1119 | 333 | 8083 | 2579 | **10663** |
| 10 | 2033-34 | 7237 | 1283 | 1020 | 214 | 8257 | 1497 | **9754** |
| మొత్తం | | **66871** | **48191** | **12472** | **8119** | **79343** | **56310** | **135654** |
| | | **115062** | | **20592** | | | | |

## 9. నీటిపారుదల రంగం- సమగ్ర విశ్లేషణ

తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పాటైనప్పటి నుంచి, సాగునీటి ప్రాజెక్టులపై అప్పటి ప్రభుత్వం భారీగా ఖర్చు చేసింది. కానీ, వచ్చిన సామాజిక-ఆర్థిక ప్రయోజనానికి, పెట్టిన ఖర్చుకి పొంతన లేదు. దీని వల్ల రాష్ట్ర ఖజానాపై తీవ్రమైన భారం పడింది. దీనికి ప్రధాన కారణం సరైన ప్రణాళిక లేకుండా అనేక నీటిపారుదల ప్రాజెక్టులను ఒకేసారి చేపట్టడం వల్ల, అవి అసంపూర్తిగా ఉండి, చివరి ఆయకట్టు రైతులకు సకాలంలో నీటిని అందించలేని పరిస్థితి ఏర్పడింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, రూ.1.81 లక్షల కోట్ల వరకు ఖర్చు చేసినప్పటికీ, కేవలం 15.81 లక్షల ఎకరాలు మాత్రమే సాగులోకి వచ్చింది. అనగా ఎకరాకు సుమారు రూ.11.44 లక్షల భారీ ఖర్చు అయింది.

1956-2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో, తెలంగాణ ప్రాంతంలో, నీటిపారుదల ప్రాజెక్టులపై రూ.54,234 కోట్లు ఖర్చు పెట్టి, 41.76 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి వసతి అందించబడింది. అయితే, 2014 నుండి 2023 వరకు మూడు రెట్లు ఎక్కువ వ్యయం చేసినా (రూ.1.81 లక్షల కోట్లు), కేవలం 15.81 లక్షల ఎకరాలు మాత్రమే కొత్తగా సాగులోకి వచ్చింది. అంటే రాష్ట్ర ఏర్పాటుకు ముందు సాగునీటి వసతి అందించబడిన ఆయకట్టుతో పోలిస్తే కేవలం 38% అనగా, 15.81 లక్షల ఎకరాలు మాత్రమే కొత్త ఆయకట్టు సృష్టించారు. 2023-24లో 17.21 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించవలసి వుండగా, కేవలం 500 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీటిపారుదల సామర్థ్యం సృష్టించబడింది.

- కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు మొత్తం రూ. 93,872 కోట్లు ఖర్చు చేసి, కేవలం 98,590 ఎకరాలు మాత్రమే కొత్త ఆయకట్టుకు నీరివ్వడం జరిగింది. బ్యారేజీలు, పంప్ హౌజ్‌లు, సబ్ స్టేషన్లు నిర్మించటం తప్ప రైతుకు నీరందించాలనే చిత్తశుద్ధి కనిపించలేదు. ఆయకట్టుకు నీరందించేందుకు అవసరమైన డిస్ట్రిబ్యూటరీలు, కాల్వలు నిర్మించాలనే ఆలోచన లేకుండా పనులు జరిగాయి.

- అంతేకాకుండా, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ ఎత్తిపోతల పథకం మరియు సీతమ్మ సాగర్ ప్రాజెక్టు వంటి ఇతర మూల ధన వ్యయంతో కూడిన నీటిపారుదల ప్రాజెక్టులపై సుమారు రూ. 36,000 కోట్ల భారీ వ్యయం చేసినప్పటికీ, ఇప్పటివరకు ఒక్క ఎకరానికి కూడా నీరు అందించలేదు.

- రీ డిజైనింగ్ తో పాటు కొత్త ప్రాజెక్టుల ప్లానింగ్ లోపాలు, పాత ప్రాజెక్టుల నిర్వాహణను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో గత పదేండ్లలో సాగునీటి ప్రాజెక్టుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కడెం

ప్రాజెక్టు నిర్వహణను పట్టించుకోకపోవడంతో 15వ నంబన్ గేట్ కౌంటర్ వెయిట్ కొట్టుకుపోయింది. ఆ గేటును కిందికి దించే అవకాశం లేకుండా పోయింది. దీంతో నీళ్లన్నీ కిందికి వదిలేయాల్సి వచ్చింది. ఫలితంగా ఈ యాసంగిలో ఆ ప్రాజెక్టు కింద 65 వేల ఎకరాలకు క్రాప్ హాలిడే ఇవ్వాల్సి వచ్చింది.

- 2019 అక్టోబర్ లో మూసీ ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయింది.. ప్రాజెక్టు ఆపరేషన్ ను కనీసం పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. అదే ఏడాది డిసెంబర్ 31న వనపర్తి జిల్లాలోని సరళా సాగర్ ప్రాజెక్టుకు గండి పడింది. సైఫన్ పద్ధతిలో ఆసియాలో నిర్మించిన మొదటి ప్రాజెక్టు ఇదే కాగా, ప్రపంచంలోనే రెండోది. దీని నిర్వహణను పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టుకు గండి పడింది. చారిత్రక ప్రాజెక్టుకు గండి పడితే విచారం వ్యక్తం చేయాల్సిన ప్రభుత్వం ఇసుక దందాకు పనికొస్తుందని చులకన చేసింది.

- రాష్ట్ర ఆర్థిక శాఖ వద్ద 28,412 బిల్లులు పెండింగ్‌లో ఉన్నవి. 27,759 (98%) పెండింగ్ బిల్లులు ఒక కోటి లోపు ఉన్నాయి, వీటి మొత్తం విలువ రూ.382.39 కోట్లు. అదేవిధంగా, రూ.1 కోటి నుండి రూ.5 కోట్ల వరకు ఉన్న 304 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి మొత్తం విలువ రూ.575.73 కోట్ల వరకు ఉన్నాయి మరియు రూ.5 కోట్ల కంటే ఎక్కువ విలువ కలిగిన 349 బిల్లులు ఉన్నాయి మరియు చెల్లించాల్సిన చెల్లింపులు రూ.12682.50 కోట్లుగా ఉన్నాయి. మొత్తం మీద, పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ.10,455 కోట్ల వరకు ఉన్నాయి, ఈ భారీ బకాయిలు చెల్లిస్తే కానీ కొత్త పనులు చేపట్టలేని దయనీయ పరిస్థితి నెలకొన్నది.

- రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి, 13.22 లక్షల ఎకరాల ఆయకట్టును రూపొందించడానికి రూ.39,119 కోట్లు ఖర్చు చేశారు. అయితే, 2014 నుండి 2023 వరకు 3 రెట్లు కంటే ఎక్కువ (రూ.1,33,874 కోట్లు) ఖర్చు చేసి, 98,590 ఎకరాల మాత్రమే కొత్త ఆయకట్టును సాగులోకి తీసుకొచ్చారు.

- నీటి వాటాల విషయంలో అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం, 1956 లోని సెక్షన్ 3 కింద టి.ఓ.ఆర్ ని కొనసాగుతున్న కెడబ్లూడిటి-II కి సూచించడానికి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేయలేకపోయింది. అందువలన, పై చట్టం ప్రకారం అదనపు టి.ఓ.ఆర్ ని సూచించడానికి కేంద్ర ప్రభుత్వానికి చాలా సమయం పట్టింది.

- తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించే పోతిరెడ్డిపాడు విస్తరణ, రాయలసీమ ఎత్తిపోతల పథకాలను అడ్డుకోలేకపోయింది. నిర్మాణంలో ఉన్న రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తయితే ఏపీకి రోజుకు 9 టీఎంసీలు డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. మహబూబ్‌నగర్ జిల్లా నివాసి ఒకరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేసే వరకు తెలంగాణ ప్రభుత్వం నిద్ర నటించింది. పర్యావరణ అనుమతులు వచ్చే వరకు పనులు నిలిపివేయాలని ఏపీని ఎన్జీటీ ఆదేశించింది. ఎన్‌జీటీలో ధిక్కరణ పిటిషన్ వేసి పనులు ఆగిపోయేలా చూడాలని కొత్త ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులను ఆదేశించింది.

- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి 34 టి. ఎం .సి కి మించి (చెన్నై నీటి సరఫరా 15 టి. ఎం. సి + శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్ 19 టి. ఎం .సి) మళ్లించకుండా ఆంధ్రప్రదేశ్‌ను కట్టడి చేయలేకపోయింది. గత ఐదేళ్లలో సగటున ఏడాదికి 133 టి ఎం సి  నీరు మళ్లించబడింది.

- పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం మరియు శ్రీశైలం ఎడమ గట్టు కాలువ  వంటి కొనసాగుతున్న ప్రాజెక్ట్‌లను APRA, 2014 షెడ్యూల్-XI లో చేర్చలేకపోయింది.

- మహారాష్ట్ర రాష్ట్రాన్ని లెండి ప్రాజెక్ట్ హెడ్ వర్క్స్ పనులను పూర్తి చేయడానికి ఒప్పించలేకపోయింది. కానీ, రాష్ట్రంలోని పనులపై రూ.223.93 కోట్లు ఖర్చు పెట్టింది. అయితే మహారాష్ట్ర భూభాగంలో ప్రధాన పనులు పూర్తి కానందు వల్ల,  జుక్కల్ నియోజకవర్గంలోని రైతులకు 22 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు.

### ప్రభుత్వ ప్రాధాన్యత

- కొనసాగుతున్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.  తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టు తీసుకురావడానికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.
- పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, భీమా ఎత్తిపోతల పథకం, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, కోయిల్ సాగర్ ఎత్తిపోతల పథకం, కొడంగల్ నారాయణపేట, చిన్న కాళేశ్వరం, ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్ఎల్‌బీసీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్, ఇందిరమ్మ వరద కాలువ, మిడ్ మానేర్, కొమురం బీమ్,  దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులను వీలైనంత తొందరగా పూర్తి చేస్తాం.
- పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (PRLIS) ను, 50% కంటే ఎక్కువ పురోగతి సాధించి నందున AIBP-PMKSY క్రింద నిధులను సమకూర్చుకొని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతుంది.

**భవిష్యత్ ప్రణాళిక:**

- తెలంగాణ ప్రయోజనాలకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. కృష్ణా నదీ జలాలకు సంబంధించి న్యాయపరంగా రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటాం. నిరాదరణకు గురైన కృష్ణా ప్రాజెక్టులను పూర్తి చేసి దక్షిణ తెలంగాణ ప్రాంతంలో ఆయకట్టుకు సాగునీటిని అందించి రైతులకు అండగా నిలబడుతాం.

- జవాబుదారీతనం, పారదర్శకతతో మా ప్రభుత్వం పని చేస్తుంది. నిర్ణీత లక్ష్యాలను చేరుకునేందుకు చిత్తశుద్ధితో పని చేస్తుంది.

- ప్రస్తుతం, నీటిపారుదల ప్రాజెక్టుల యొక్క పనులు, వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. అవినీతికి ఆస్కారం లేకుండా, సమర్థమైన వినియోగంతో గరిష్ట ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు తగినన్ని నిధులు కేటాయిస్తేనే లక్ష్యం నెరవేరుతుంది. ఆ దిశగా కార్యాచరణ రూపొందించుకుంటాం.

- అందుకే ఈ ప్రభుత్వం. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, పనుల స్థితిగతుల ఆధారంగా ప్రాజెక్టులకు సముచితంగా ప్రాధాన్యతనిస్తూ అవసరమైన నిధులను అందించడానికి కట్టుబడి ఉంది.

****************